వ్యవహారభాష - వ్యాకరణము

వ్యవహార భాషావాదం పుట్టి నలభై యేళ్లపై చిలుకైనా ఆ వ్యవహారభాషంటే ఏమిటో, దాని సమగ్ర స్వరూపమేమిటో నిర్ణయించినవారెవరూ ఇంతవరకూ లేరు. ఈ వాదానికి మూల స్తంభమని చెప్పదగిన గిడుగు రామమూర్తి పంతులు గారు మరణించి ఇప్పటికి దాదాపు ఇరవై సంవత్సరాలు కావస్తున్నది. మరణాత్పూర్వం ఆయన తెలుగు భాష యొక్క స్వరూప స్వభావాలను సమగ్రంగా నిరూపించుదామనే తలంపుతో ఒక పదకోశాన్ని కొంత తయారుచేసినట్టూ, ఆయన మరణానంతరం ఆ పదకోశం అతి విచిత్ర పరిస్థితుల్లో అంతర్ధానమైనట్లూ, నిజమో కాదో కాని లోకంలో ఒక కింవదంతి ఉన్నది. కీర్తిశేషులు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు చెప్పినట్లుగా ఆంధ్రకావ్య భాషకే సరియైన వ్యాకరణం మనకు ఇంతవరకూ లేదు. వ్యవహార రూపాలను ఒప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా తెలుగు కావ్యాలలో ఉన్న ప్రయోగ వైచిత్రినంతా విశదీకరిస్తూ ఒక గ్రంథము వ్రాయటానికి తగిన పాండిత్యం ఉన్నవాళ్లు తెలుగుదేశంలో వేళ్లమీద లెక్క పెట్టదగినంత మందికూడ లేరు. ఏ యిద్దరు ముగ్గురన్నాఉంటే వాళ్లకి అహమస్మి అని ముందుకు వచ్చే సాహసం లేదు. 'వ్యాకరణ మ్మొక త్రోవ, మహాకవులొక త్రోవ కోశ మఖిలమ్మొక త్రోవై కన్పించెడి నీ భాషా కావ్యములను తఱచు చదివిన కొలది, అందుచేత భాష యొక్క సమగ్రస్వరూపం నిర్ణయించడమనేది సుఖసుఖాలమీద తేలేపని కాదు. పోనీ ఆ యిద్దరి ముగ్గురిలో ఎవరైనా ఒకళ్లు సాహసించి ముందుకు రాకపోవడానికి కారణం ఈ పైవిషయాన్ని బాగా ఎరిగుండబట్టి హాస్యాస్పదులం అవుతామేమో అనే అనుకోవలసివస్తుంది. కావ్యభాష సంగతే ఇల్లా ఉంటే దారీ తెన్నూ లేని వ్యవహారభాషను వ్యాకరించ బూనుకోవటం సంగతి వేరే చెప్పక్కఱలేదు.

అసలు వ్యవహారభాషకి ఒక వ్యాకరణం కావాలి అనుకోవడంలోనే ఉన్నది చమత్కారమంతా. వ్యవహార భాషకి వ్యాకరణం లేదు అనే ఒక గోల దేశంలో చాలాకాలంబట్టి వినిపిస్తున్నది. ఒక పక్క నుంచి ఈ గోల ఇట్లా ఉండగా ఆగిడుగు రామమూర్తి గారు ఆ వ్యవహార భాషాస్వరూపం ఎట్లా ఉంటే బాగా ఉంటుందని అనుకున్నారో దానికి సంవత్సరానికి వందమైళ్ల చొప్పున వ్యవహారభాష దూరం పోతూవచ్చింది. గిడుగు రామమూర్తి పంతులు గారే ఆ వ్యవహారభాష కొక వ్యాకరణం

వ్రాసిఉంటే అప్పటి కది సమగ్రమైనా కాకపోయినా మరు సంవత్సరానికల్లా వందమైళ్ళు వెనుకబడిపొయ్యేది. అదిన్నీ కాక ఈ వ్యవహారభాషా వ్యాకరణం వ్రాయడానికి ప్రామాణికంగా తీసుకోవలసిన పదజాలం ఉంటుంది కదా! ఈ పదజాలం నిత్య వ్యవహారంలో ప్రజలు ఉపయోగించేదాన్ని తీసుకోవలెనా లేక వ్యవహార భాషలో గ్రంథములు వ్రాస్తున్నామని చెప్పే వారి రచనల్లో నుంచి తీసుకోవలెనా అనే ఒక పెద్దతగాదా ఉంది. నిష్పక్షపాతంగా చెప్పవలెనంటే భగవంతుడి ముఖం చూచి నేను అచ్చమైన వ్యవహార భాషలోనే వ్రాయగలనని చెప్పే వాడు ఎవడూ ఇంతవరకూ పుట్టలేదు. వచనంలో కొంత వ్యవహార భాషకు దగ్గరగా వ్రాయవచ్చు. పద్యంలో అసలు వ్యవహారభాషను వ్రాయడమనేది దుర్లభమైన విషయం. అది యెవడో మహా ప్రతిభావంతుడు కాని నూటికి పాతికపాళ్లైనా నిర్వహించ లేని విషయం. గిడుగు రామమూర్తి పంతులుగారి వాదాన్ని నవ్యసాహిత్య పరిషత్తు వారు నూటికి నూరుపాళ్లూ అంగీకరించారు. నవ్యసాహిత్యపరిషత్తు సృష్టించిన కవులలో అతిరథమహారథులమని అనుకొనేవాళ్లు కూడా వ్యవహార భాషలో పద్యములు వ్రాయలేదు. వ్రాస్తే ఆ వ్యవహార భాష వారు వ్రాసిన గ్రాంథిక భాషకన్నా అధ్వాన్నంగా ఉండేది. వ్యవహార భాషలో పద్యాలు వ్రాయాలంటే వేణుగోపాలశతక కర్త, చంద్రశేఖరశతక కర్త, కూచిమంచి జగ్గకవి లాంటి ప్రతిభాశాలులు ఉండాలి. ఇంత నవ్యసాహిత్యపరిషత్తు చరిత్రలోనూ వ్యవహారభాషలో వ్రాసిన పద్యాలు వేళ్ళమీద లెక్క పెట్టదగినంతకంటె ఎక్కువలేవు. వాటిలోని భాష కూడా అకృత్రిమము కాదని చెప్పటానికి వీలులేదు.

ఇది ఉట్లా ఉండగా వాక్యనిర్మాణం దగ్గర వ్యవహారానికీ వ్రాయడానికీ మధ్య ఒక పెద్ద అఖాతం ఉన్నది. మాట్లాడటంలో వాక్యనిర్మాణం వేరు. వ్రాతలో వాక్యనిర్మాణం వేరు. వ్రాతలో ఉన్న కుదింపు మాట్లాడటంలో ఉండదు. మాట్లాడటంలో ఉన్న స్వాభావికత, వ్యంజకత్వం వ్రాతలో ఉండదు. పూర్వమహాకవుల గొప్పతనమంతా ఇక్కడేఉన్నది. తెనుగువాడు ఒక భావాన్ని వ్యక్తం చేసేటప్పుడు వాక్యనిర్మాణం ఎట్లా చేస్తాడో వారు బాగా పరిశీలన చేసి మరీ వ్రాశారు. వాక్యంలో ఉన్న పదముల యొక్క స్థానాన్ని బట్టి, ఆ వాక్యం మొదలు పెట్టుట, అంతము చేయుటలను బట్టి, ఆ వాక్యం ఉచ్చరించేటప్పుడు కంఠస్వరంలో తెచ్చే హెచ్చుతగ్గులను బట్టి వక్తయొక్క భావంలోని వైవిధ్యం స్ఫురిస్తూ ఉంటుంది. భావానికి సహస్రముఖములుంటవి. ఏ ముఖమునుండి

భావాన్ని ప్రకటించినపుడు తెలుగువాడేవిధమైన వైఖరిని అవలంబిస్తాడో దానిని పట్టుకొని వ్రాయడంలో మహాకవి యొక్క ప్రతిభ అంతా ఉంటుంది. అందుచేత వ్రాయడమనేది మాట్లాడే అంత తేలిక గాదు. ఎంత వీరవ్యవహారభాషావాది యైనా తాను మాట్లాడినట్లే తాను వ్రాయలేడన్నది నూటికి నూరుపాళ్లూ యథార్థము. ఈ దృష్ట్యా చూస్తే నేటి వ్యవహారభాషావాదులు వ్రాసేభాష అంతా బహు కృత్రిమమైనదని చెప్పవచ్చును. కావ్యభాషలో వ్యవహారంలో ఉన్న ఈ భావప్రకటనావైఖరి అనేది సహస్రాంశాల్లో ఒక అంశం కాబట్టి ఆ భాషకి కృత్రిమత్వం ఈ దృష్ట్యా ఆరోపించడానికి వీల్లేదు. కావ్యభాష అల్లాగేఉండాలి అనే విషయాన్ని ఇక్కడ నిరూపింపవలసిన అవసరం లేదు. ఆ సహస్రవిషయాల్లో ఏ పది విషయాలో తెలిసికొని అవ్వి ఈ వ్యవహారభాషలో వ్రాస్తే జారిపోతాయని తెలియబట్టే నవ్య సాహిత్య పరిషత్తు తాలూకు కవులు కూడా వారికి చేతనైనంత కావ్యభాషలో కావ్యాలు వ్రాశారు.

ఈ వ్యవహార భాషావాదము యొక్క పట్టంతా అందరికీ అర్థమయ్యేట్టు వ్రాయాలనడంలో ఉంది. ఇంతకంటే బలవత్తరమైన కారణం మరొకటి లేదు. సాధ్యమైనంత ఎక్కువమంది కర్థమయ్యేటట్టు తేలికభాషలో వ్రాయా లనడం అందరూ ఒప్పుకోదగ్గదే. కాని అందరికీ అర్థము కావడమనేది గ్రాంథిక వ్యవహార భేదంలోలేదు. గ్రాంథికభాష ఎక్కువమందికర్థమై వ్యవహారభాష అనేది అర్థం కాకపోవచ్చు. అర్థం కావడం కాకపోవటం వాడిన పదజాలాన్ని బట్టీ, చెప్పే విషయము యొక్క కాఠిన్యాన్ని బట్టీ ఉంటుంది. 'నీ రాక నాకు సంతోష కారణము' అంటే అర్థం కాకపోయి 'నీ ఆగమనం నాకు ముదావహం' అంటే అర్థమవుతుందా? వ్యాకరణాన్ని మీరింతమాత్రం చేత కఠినమైన పదాలు వాడినా అది వ్యవహారభాష ఔతుందనుకోవటం కంటే భ్రాంతి ఇంకోటి ఉండదు. నేడు వ్యవహారభాషగా చలామణిఔతున్న భాషలో చాలాభాగం ఇల్లాంటిదే.

అభ్యుదయ కవుల్లో అగ్రేసరులుగా చెప్పబడుతున్న శ్రీశ్రీ, ఆరుద్ర మొదలైన వాళ్ళ భాష అంతా ఇట్లాంటిదే. అందరికీ తెలిసే అట్టు వ్రాయాలనడం అభ్యుదయ కవులయొక్క అభిప్రాయమే ఐనప్పటికీ వాళ్ళకంటే దుర్బోధంగా వ్రాసేవాళ్ళు ఎవ్వరూ లేరు. అందుచేత మాట్లాడుకున్నట్టు వ్రాయడమనేది అసాధ్యమనేది ఋజువు ఔతున్నది కదా!

ఈ సంగతి ఇట్లా ఉండగా పత్రికలభాష ఉన్నది. ఇది కూడా వ్యవహారభాషక్రింద చలామణిఔతున్న భాష, కాని న్యాయం ఆలోచిస్తే ఈ భాషయందున్నటువంటి కృత్రిమత్వం సంగతి అట్లా ఉంచి ఏ కొంచెమైనా వ్యవహారానికి దగ్గరగా ఉన్నదంటే ఆ ఉన్న కొంచెం దగ్గరతనమూ కృష్ణాజిల్లా వ్యవహారభాషతోనే ఉంది. అందులోనూ కృష్ణాజిల్లా బ్రాహ్మణులు మాట్లాడే భాషతోనే సంబంధం కలిగి ఉంది. దీనికి కారణం అందరికీ తెలిసిందే. తెలుగుదేశంలో ప్రముఖమైన రెండు దిన పత్రికలూ కృష్ణాజిల్లా వారిచేత నడపబడేవి కావటం. అందులోనూ ప్రధానంగా ఆంధ్రపత్రిక భాషకు మిక్కిలి ప్రాముఖ్యం రావడం, తరువాత వచ్చిన ఆంధ్రప్రభ ఆ మార్గాన్నే అనుసరించక తప్పకపోవడము. అందుచేత కృష్ణాజిల్లా బ్రాహ్మణభాషకి తెలుగుదేశమంతా బాగా ప్రచారం వచ్చి అది ఒక రకమైన రచనాభాషగా రూపొందింది. అదైనా పైన పేర్కొన్న కారణాలవల్ల సహజంగానూ, వ్యంజకంగానూ రూపొందలేదు. వ్యవహారభాషలో వ్రాస్తున్నామనుకోనేవాళ్లంతా కొంతకృత్రిమత్వం పొందిన ఈ కృష్ణాజిల్లా బ్రాహ్మణభాషకే దాస్యం చేస్తున్నారు. ఇది అక్షరాలా నిజం. మాధవపెద్ది గోఖలే మొదలైనవారు కొందరు ఈ భాషా నియంతృత్వాన్ని కూలదోయాలని ప్రయత్నమైతే చేస్తున్నారు కాని ఆ ప్రయత్నానికి నాలుగుమూలల నుంచీ బలం చేకూరలేదనే చెప్పాలి. ఈ వ్యవహార భాషలో వ్రాస్తున్నామనుకొనేవారి కృష్ణాజిల్లా బ్రాహ్మణ భాషా దాస్యం ఎంత బలమైందంటే అట్లాంటి భాషా దాస్యం వాళ్ళు చేస్తున్నారనేది కూడా వాళ్లకు తెలియదు. ఆ పత్రికలు చదవటం వల్ల ఆ భాషలో వ్రాసిన ఇతర రచనలు చదవడం వల్ల ఆ వాతావరణం బాగా వాళ్ల మనస్సులపైన ముద్రితమైపోయింది. వారిలో అబ్రాహ్మణులు కూడా ఇతరత్రా వారికి సహజమైన భాషలోనే మాట్లాడినా వ్రాయడం వద్దకువచ్చేసరికి ఈ భాషలో వ్రాస్తారు. ఇది వ్యవహారభాష అనుకొంటారు. నూటికి ముగ్గురు అందులో కృష్ణాజిల్లాలో వాళ్ళు మాత్రమే మాట్లాడే భాష వ్యవహారభాషయై కూర్చోటంకంటే విచిత్రం ఇంకొకటేముంటుంది? ఆంధ్రదేశానికి ఎల్లల్లో ఉన్న పర్లాకిమిడి, నిజామాబాద్, చిత్తూరు జిల్లాల వారూ కూడా తమ మాండలిక భాషల్లో వ్రాయటానికి జంకుతారు. తమకి సహజమైన భాషలో వ్రాయడానికి జంకుతారు. కృష్ణాజిల్లాలోనే పైకులాలకు చెందిన అబ్రాహ్మణులు మాట్లాడేఅప్పుడు ఉండాడు, యెళ్తాను, ఎంటికలు అని అంటారు. వ్రాసేఅప్పుడు ఉన్నాడు, వెళ్లను, వెంట్రుకలు అని వ్రాస్తే గ్రాంథికమగునని భావిస్తారు. తెలంగాణములో వచ్చిండు, పొద్దుగాల,

వాన్ని తోలుకరా మొదలైనవి మాట్లాడుతారు. వ్రాసేటప్పుడు 'వచ్చాడు, పొద్దున్నే, వాణ్ణి తీసుకరా' అని వ్రాస్తారు. వచ్చినాడు, ప్రొద్దున, తీసికొనిరమ్ము అని వ్రాస్తే గ్రాంథికమని అనుకొంటారు. న్యాయానికి ఆ కృష్ణాజిల్లాలో అబ్రాహ్మణ రచయితలకీ, ఈ తెలంగాణా రచయితలకీ అందరికీ కూడా ఆ గ్రాంథిక భాష ఎంత గ్రాంథికమో ఈ వ్యవహార భాషా అంత గ్రాంథికమే. వారు మాట్లాడే భాష దృష్ట్యా రెండూ సమానమే. ఒక దాన్ని గ్రాంథికమనీ, రెండవదాన్ని వ్యవహారమనీ వారిని వారు వంచించుకొంటున్నారు. అందుచేత ఈ వ్యవహార భాష అనబడే భాష అటు గ్రాంథికం కాకుండా ఇటు నిజమైన ప్రజాభాష కాకుండా త్రిశంకు స్వర్గంగా వ్రేలాడుతుంది.

మరొక విచిత్ర మేమిటంటే ఈ వ్యవహార భాషలోని శబ్దస్వరూపంకంటే గ్రాంథిక భాషలోని శబ్దస్వరూపమే తెలుగుదేశంలోని అన్ని జిల్లాల వారు వాడే శబ్దస్వరూపానికి దగ్గరగా ఉంటుంది. అందుచేత తక్కినజిల్లాల వారికి ఈ వ్యవహారభాషను నేర్చుకోవటంకంటే ఆ గ్రాంథిక భాష నేర్చుకోవటమే చాల సులభం. కృష్ణా జిల్లాకి దూరంలో ఉన్న, రచయితలు కాకుండా పత్రికలు చదవకుండా ఉండి అక్షరాస్యులు ఐనవారు ఈ వ్యవహారభాషలో వ్రాసిన గ్రంథాలను పత్రికలను గాని చదవటం తటస్థిస్తే వారు సరిగ్గా అర్థం చేసికోలేరు. కాని భారత భాగవతాదులు చదివి అర్థం చేసికోగలరు. అక్షరాస్యులే అక్కరలేదు. సామాన్య ప్రజలు కూడా భారత భాగవతాదులను చదివితే అర్థం చేసికోగలగటం సర్వత్రా ఉంది. కాని ఇటీవల ప్రచురితాలైన వ్యవహారభాషా భారత రామాయణాలను అర్థం చేసుకోలేరు. ఇందుచేత ప్రజాభాషకి దగ్గరైన భాష మనకి ఏదో సుగమంగా తెలుస్తుంది. శబ్దకాఠిన్యం అక్కడా ఇక్కడా సమానమే. తేడా వ్యాకరణంలో ఉంది. గ్రాంథిక భాషా స్వభావం తెలుగుదేశములోని సర్వ ప్రజాభాషా స్వభానికి దగ్గర. ఈ దగ్గరతనంవల్ల గ్రాంథిక భాష అర్థం కావడం, వ్యావహారిక భాష అర్థం కాకపోవడం జరుగుతున్నది. ఇది యిట్లా ఉండగా వ్యవహార భాషావాదులు ప్రాయికంగా ఆంగ్లభాషాపరిచయం కలవాళ్లు కాబట్టి ఆ భాషాపదాలు ఆ వాక్యనిర్మాణ పద్ధతులు ఈ వ్యవహార భాషలోనికి దిగుమతి ఐనవి. ఆయా దేశాలనుండి సంక్రమించిన నూత్న విషయాలను గురించి వ్రాయవలసివచ్చినపుడు మాత్రమే కాకుండా దేశీయమైన విషయాలను చెప్పవలసి వచ్చినపుడు కూడా ఆంగ్లవాసన లేకుండా చెప్పడం సకృత్తుగా కాని కనిపించదు. అందుచేత ఒకవిధమైన అస్పష్టత, ఒక విధమైన కృత్రిమత్వము ఈ

భాషయందలముకొన్నవి, మరొకటి, వీరిలో ఎక్కువ మందికి సంస్కృతాంధ్రాల యందు ప్రవేశ మంతంతమాత్రం కావటం చేత ఆయా శబ్ద స్వరూపాలు పరిభ్రష్టములై వాడబడుతూవచ్చినవి. భాష తెలియని లోపం వల్ల కలిగిన ఈ దోషాలు అనంతంగా ఉన్నవి. భాషలో పాండిత్యం తగ్గి పోతూఉన్న కొద్దీ ఈ దోషాల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఈ దోషాలు శబ్దస్వరూపానికీ, అర్థానికీ సంధిసమాసాదులకూ సంబంధించినవి.

గిడుగు రామమూర్తీ, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి వంటివారు ఇల్లాంటి దోషాలు లేని భాష వ్రాసిన మాట నిజమే. వారు వ్రాసినభాషే ప్రమాణంగా స్వీకరించాలి అంటే అది ఇద్దరిభాష మాత్రమే అవుతుంది. మూడుకోట్ల ఆంధ్రుల్లో ఇద్దరిభాషనే ప్రమాణంగా స్వీకరించడమా అనే మాట వస్తుంది. అట్లాకాదు శిష్టవ్యావహారికాన్ని ప్రమాణంగా తీసికొని తక్కిన భాషమీద ఒక గీటు పెడదామంటే ఇంతకంటే కొంచెం మడికట్టుకొన్నవాడు ఈ శిష్టుల భాషమీద కూడా గీటు పెడదామూ అని యెందు కనకూడదు? ఆ గ్రాంథికభాష కంటే ఈ శిష్ట వ్యావహారికాని కెక్కువ సౌలభ్యముంటే దీనిని ఒప్పుకోవచ్చు పైగా ఈ శిష్టులంటే ఎవరు? గిడుగు రామమూర్తి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి వంటివారా? అటువంటివారు శిష్టులంటే ఇప్పుడట్లాంటి వాళ్ళెవరున్నారు? ఒకవేళ ఉన్నా ఆ వ్యాకరణ నియమాలనే ఉల్లంఘించాలి అన్నంత పట్టుదల ఎందుకు? వ్యాకరణ నియమాలంటే ఏ చిన్నయ్యసూరియో, బహుజనపల్లి సీతారామాచార్యులో చేసినవి కావు. భాషాస్వభావం తెలిసిన మహాకవులు తమ ప్రయోగాలలో అనుసరించినవి. ఎక్కడైనా ఒక చోట శ్రవణసుఖాన్ని పట్టో, రసావేశాన్ని పట్టో కొన్ని అతిక్రమణలుంటే ఉండవచ్చు. అంతేకాని మొత్తం వ్యాకరణాన్ని అంతా తిరస్కరిద్దామంటే దానివల్ల ప్రయోజనమేమిటి? ఏకట్టుబాటూ అక్కర లేకుండా వ్రాయాలి అనే ప్రయోజన మొక్కటేకదా? విశృంఖలంగా వ్రాయడం చాలా తేలికైనమాట నిజమే గాని అట్లా వ్రాయాలనుకొనేవాడు శిష్టుడవుతాడా? అనే ప్రశ్న పుడుతుంది. అందుచేత శిష్టజన వ్యవహారమంటే అవసరమైనచోట, ఔచిత్యాన్ని బట్టి, ఎన్నో కారణాలవల్ల వ్యాకరణాన్ని మీరినా పరవాలేదు అని మీరిందే కాని అపాండిత్యం వల్ల, అశక్తివల్ల వ్యాకారణాన్ని మీరిందికాదు. అందుచేత శిష్టజన వ్యవహారమనేది గిడుగు రామమూర్తి పంతులు గారి నాడే పోయింది. తరువాత ఎవరి కిష్టులైనవారు వారికి శిష్టులవుతూ వచ్చారు. మాటలో మాత్రమే శిష్టజనవ్యవహారం మిగిలింది. సరే శిష్టజన

వ్యవహారమో, ఇష్టజన వ్యవహారమో ఏదో ఒకటి. దానికి స్వచ్ఛందంగా వ్రాయటమే మూలసూత్రమైనపుడు, పాండిత్యంతో భాషాస్వభావ పరిశీలనంతో దానికి నిమిత్తం లేనప్పుడు, దానికి వ్యాకరణం కావాలి అనుకోవటంలో అర్థమేమిటి? నేనిప్పుడీ భాష వ్రాస్తున్నాను. నాకు మాట్లాడటం అలవాటైన భాషకు దగ్గరగానే వ్రాస్తున్నాను. దీని కోసం నేను ఏ వ్యాకరణాన్నీ చదువనక్కరలేదు. అట్లా కాదు. నాకు అలవాటులేని కృష్ణా జిల్లా బ్రాహ్మణ భాషకు దగ్గరగానే వ్రాస్తున్నాను. అప్పుడు మాత్రం వ్యాకరణం చదవటం ఎందుకు? ఈ భాషలో వ్రాసేవారంతా ఏ వ్యాకరణసూత్రాలను చదివి వ్రాస్తున్నారు? ఆ పత్రికలు చదవటం వల్ల, ఆ భాష ప్రభావానికి లోబడి అట్లా వ్రాస్తున్నారు. అంతేకదా? దీనికి మళ్లా ఒక వ్యాకరణం దేనికి? అనుశాసనం కాకపోతే వ్యాకరణం యొక్క ప్రయోజనం మరొకటి లేనేలేదు. భాష యొక్క స్వభావం నిరూపించడం ఆ స్వభావం యొక్క పరిచయం పాఠకునికి కలగజేయడమే అనుశాసన మంటే. భాషా స్వభావ పరిచయం వల్ల భాష యందు పాఠకునికి స్వాతంత్ర్యం కలుగుతుంది. అప్పుడు ఆ పాఠకుడు ఒక గ్రంథాన్ని చదువుకుంటే దాన్ని చక్కగా ఆస్వాదించగలుగుతాడు. ఏదైనా వ్రాస్తే భాషయొక్క ప్రాణం పట్టుకొని వ్రాయుగలుగుతాడు. ఈ రెండు ప్రయోజనాల దృష్ట్యా భాషా స్వభావాన్ని వ్యాకరించవలసిన అవసరం - దానిని పాటించవలసిన అవసరం ఉన్నది. ఈ రెండు ప్రయోజనాలూ లేని వ్యవహారభాషకు వ్యాకరణం కావాలనుకోవడం ఎందుకో అర్థం కాని విషయం.

ఆలోచించగా ఆలోచించగా దీనికల్లా ఒకటే కారణం కనిపిస్తున్నది. అది మనుష్య స్వభావంలో ఉన్న నియమకాంక్ష. మనిషికి స్వభావసిద్ధంగా నియమ మందు వైముఖ్యం లేదు. నియమరహితంగా మనిషి జీవించలేడు. అయితే తత్పూర్వం ఉన్న నియమాలకు అతడు అశక్తుడవటంవల్లనో, ఇంకే ఇతర కారణం చేతనో కట్టుబడి ఉండలేక పోవచ్చును. వాటి నతడు మీరిపోవచ్చును. కాని తన అతిచారాన్ని కూడగట్టుకొనివచ్చే నియమం చేస్తే అతనికి తృప్తి కలుగుతుంది. అటువంటితృప్తి ఈ వ్యవహారభాషా వాదులందరికీ కావలసివచ్చింది. తాము వాడిన అప శబ్దాలు, దుస్సంధులు, కృత్రిమవాక్యనిర్మాణాలు, విజాతీయ పదప్రయోగాలు మొదలైనవన్నీ శాస్త్రసమ్మతిని పొందాలి. అందుకోసం వారికి కొత్త వ్యాకరణం కావాలనే తహతహ. ఈ తృష్ణను తీర్చడం కంటే వ్యవహారభాషావ్యాకరణానికి ఇంకో ప్రయోజనం ఉండదు.❖

(జయంతి -7 మే - 1959)